



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 40 ఎడిటర్: రాపోలు లింగస్వామి 10-10-2026 శనివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలి

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.**

**తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభించిన మంత్రి**

రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 09:తూర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెలా రాజేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రోడ్ల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎమ్మెల్సీ ఎలిగంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం)





రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, డిజి నర్సింహా రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి లు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో తూర్కయంజాల్ లో 'తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించి లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో ప్రజలకు వైద్యం చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, దేవరకొండ, కల్వకుర్తి, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలకు మా ఆసుపత్రి అందుబాటులో ఉంటుందనీ చెప్పారు. "సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. తార మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించి, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తాము" అని తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, అనేస్తాషియా వంటి అన్ని ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు అత్యాధునిక పరికరాలతో 24/7 అత్యవసర సేవలు, ల్యాబ్, ఫార్మసీ,సిటీ స్కాన్, ఇన్-పేషెంట్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డాక్టర్లు తరుణ్ తెజ్, సంతోష్ వర్మ,




ఐశ్వర్య, లక్ష్మణ్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మాలోత్ రాజు, సుధాకర్ రెడ్డి, లహరీ తిరుణగారి, అలేఖ్య రెడ్డి, శృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో ఎల్‌నినో పై

## సీఎం రేవంత్ యాక్షన్ ప్లాన్..



హైదరాబాద్, అక్టోబరు 9: ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్? పెట్టారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సీఎం అక్టోబర్ 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది.

### 142 కంపెనీల భాగస్వామ్యంతో

## ఉద్యోగాల జాతర

భూపాలపల్లి : యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలను సాధించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. ఉద్యోగాల కోసం ప్రాంతీయ పరిమితులు పెట్టుకోకుండా, ఎక్కడ అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లిలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాలో 142 కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రారంభంలో రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా,



అనుభవం, నైపుణ్యాలను పెంచుకుంటే భవిష్యత్తులో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు సంపాదించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**రెండున్నరేళ్లలో 70 వేల ఉద్యోగాలు**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

అమెరికాలో మారుతున్న నిబంధనల కారణంగా అక్కడ పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్థానికంగా యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ, టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. యువతకు గొప్ప అవకాశమన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, ఈ జాబ్‌మేళా ద్వారా సుమారు 10 వేల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో నైపుణ్య శిక్షణను విస్తరించడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాలను ఉపయోగించుకొని తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈవో ప్రదీప్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో డిజిటల్ సేవలు, చివరి వ్యక్తి వరకు పంపిణీ

**బలోపేతం చేస్తున్న భారత తపాలా శాఖ.. ఆర్థిక సేవల విస్తరణ?**

**"ఒకే తపాలా వ్యవస్థ, అపరిమిత అవకాశాలు"-ప్రజలకు అందుబాటులో ఉండే, సాంకేతికత ఆధారిత సేవలు అందించడమే లక్ష్యం: సీపీఎంజీ శ్రీ డీఎస్‌వీఆర్ మూర్తి?**

**ప్రతి నెలా 20 లక్షల మంది చేయూత పింఛన్ లబ్ధిదారులకు సేవలు.. 263 ఆధార్ కేంద్రాల ద్వారా పౌర సేవలు?**

**17 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా 1,86,202 నియామక పత్రాల అందజేత..తెలంగాణ ప్రాంతంలో 1,272 మంది అభ్యర్థుల ఎంపిక**



హైదరాబాద్, అక్టోబర్ 9, 2026:అక్టోబర్ 9 ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 15 వరకు జాతీయ తపాలా వారోత్సవాలను తపాలాశాఖ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ)శ్రీ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడారు. భారత తపాలాశాఖ సాధించిన విజయాలు,సాంకేతిక పురోగతి, పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా శ్రీ మూర్తి మాట్లాడుతూ.. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) ఏర్పాటైన సందర్భంగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది "ఒకే తపాలా వ్యవస్థ- అపరిమిత అవకాశాలు" అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. తపాలా కార్యాలయాల ద్వారా విస్తృత సేవలను కొనసాగిస్తూనే, ఆధునిక సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే సంస్థగా భారత తపాలాశాఖ అభివృద్ధి చెందుతున్న తీరును ఈ నినాదం ప్రతిబింబిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,49,385 కార్యాలయాలతో సహా మొత్తం 1,64,999 తపాలా కార్యాలయాలతో

2 వ పేజీలో ..

## సిద్దిపేట జిల్లా దశాబ్ది సంబురాలు ప్రారంభం..

**10కే రన్‌కు జెండా ఊపిన హరీశ్‌రావు**



సిద్ధిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది పండుగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ పరుగులో యువత, క్రీడాకారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సాహంగా సాగిన 10కే రన్‌తో జిల్లా దశాబ్ది సంబురాలకు ఆరంభం లభించింది. సిద్ధిపేటలో నేటి నుంచి మూడు రోజుల పాటు జిల్లా దశాబ్ది పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద హరీశ్‌రావు నివాళులర్పించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొననున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి పదేళ్లలో సాధించిన ప్రగతిని గుర్తుచేసుకుంటూ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# సంపాదకీయం

## ఆయిల్‌పామ్... సుంకం తగ్గింపు దేనికి సంకేతం?

'దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించాలి, దేశీయ ఉత్పత్తిని పెంచాలి,రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు ప్రోత్సహించాలి, వంటనూనెల విషయంలో దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించాలి'? ఇదీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్?ఆయిల్‌పామ్' ద్వారా దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ విస్తరణను ప్రోత్సహిస్తోంది. కేంద్రం ఇచ్చిన ఈ విధాన సంకేతాన్ని నమ్మి తెలంగాణ వంటి రాష్ట్రాలు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు శ్రీకారం చుట్టాయి.ఒకవైపు దేశీయ ఆయిల్‌పామ్ సాగును పెంచాలని చెబుతూ,మరోవైపు విదేశాల నుంచి వచ్చే క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాలను వరుసగా తగ్గించడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. 2024లో దేశీయ నూనెగింజల రైతులను చౌక దిగుమతుల నుంచి రక్షించేందుకు క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై ఎఫెక్టివ్ ఇంపోర్ట్ డ్యూటీని 27.5 శాతానికి పెంచిన కేంద్రం, ఆ తర్వాత దానిని 16.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు మరోసారి దిగుమతి సుంకాన్ని తగ్గించే నిర్ణయం తీసుకుంది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో వంటనూనెలు అందించాలనే లక్ష్యం అవసరమైనదే.కానీ ఆ ఉపశమనం కోసం దేశీయ రైతు ఆదాయం, అతని దీర్ఘకాలిక పెట్టుబడి, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయిల్‌పామ్ విస్తరణ భవిష్యత్తు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కూడా అంతే అవసరం.ఆయిల్‌పామ్ విస్తరణ కేవలం ఢిల్లీలో ఒక ప్రకటనతో జరగదు.క్షేత్రస్థాయిలో రైతును ఒప్పించాలి, సంప్రదాయ పంటల నుంచి దీర్ఘకాలిక ఆయిల్‌పామ్ సాగువైపు మళ్లించాలి, మొక్కలను అందుబాటులోకి తేవాలి,సాగునీరు, డ్రిప్, తోటల నిర్వహణకు సహకరించాలి,ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించాలి, కంపెనీలు?రైతుల మధ్య సమన్వయం చేయాలి. ఈ మొత్తం బాధ్యతను ప్రత్యక్షంగా నిర్వహించేది రాష్ట్ర ప్రభుత్వాలే. తెలంగాణ ప్రభుత్వం కూడా రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయిల్‌పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 3.2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించింది. ఇక్కడే అసలు వైరుధ్యం కనిపిస్తోంది. రైతును ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకువచ్చే బాధ్యత రాష్ట్రానిది. కానీ అదే రైతు పంట ధరను ప్రభావితం చేయగల దిగుమతి సుంకం నిర్ణయం మాత్రం కేంద్రం చేతిలో ఉంది.దిగుమతి సుంకాల తగ్గింపుతో చౌకైన విదేశీ పామాయిల్ దేశీయ మార్కెట్‌లోకి వచ్చి రైతు ఆదాయంపై ఒత్తిడి ఏర్పడితే, రైతు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించడు. తనకు అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్నే అడుగుతాడు. స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీస్తాడు. విధానం కేంద్రానిది, కానీ రైతు ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సింది రాష్ట్రం. ఈ పరిస్థితిని కేంద్రం విస్మరించకూడదు. ఇది కేంద్రం?రాష్ట్రం మధ్య రాజకీయ వివాదంగాచూడాల్సిన అంశం కాదు;సమాఖ్య వ్యవస్థలో వ్యవసాయ విధాన నిర్ణయాలు ఎలా ఉండాలన్న మౌలిక ప్రశ్న. ఆయిల్‌పామ్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నరాష్ట్రాలతో సంప్రదించకుండా దిగుమతి విధానంలో తరచూ మార్పులు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన భరోసాను ఎలా నిలబెట్టుకోగలుగుతాయి?ఆయిల్‌పామ్‌ను ఇతర పంటలతో పోల్చలేం. వేరుశెనగ, సోయాబీన్ వంటి పంటలు ఒక సీజన్‌లో గిట్టుబాటు కాకపోతే రైతు తర్వాతి సీజన్‌లో మరో పంటకు మారవచ్చు. ఆయిల్‌పామ్ రైతుకు ఆ అవకాశం లేదు.మొక్క నాటిన తర్వాత వాణిజ్య స్థాయిలో ఆదాయం రావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. నీటి వసతి, డ్రిప్, ఎరువులు, నిర్వహణపై నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఒకసారి తోట ఏర్పాటు చేసిన రైతు దాదాపు మూడు దశాబ్దాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఆ పంటతో ముడిపడి ఉంటాడు. అంటే రైతు నాటింది కేవలం ఆయిల్‌పామ్ మొక్క కాదు; ప్రభుత్వ విధానంపై తన నమ్మకాన్ని. “విదేశీ పామాయిల్‌ను మరింత చౌకగా తీసుకొస్తే.నా పెట్టుబడికి,నా భవిష్యత్తుకు భరోసా ఎవరు?” అని రైతు అడిగితే దానికిసమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.దిగుమతి సుంకం తగ్గినంత శాతంలోనే రైతుకు లభించే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్ఎఫ్‌బీ) ధర తగ్గుతుందని చెప్పలేం. అంతర్జాతీయ క్రూడ్ పామాయిల్ (సీపీఓ) ధరలు, మారకపు విలువ,రవాణా వ్యయం, ప్రాసెసింగ్ మార్జిన్లు, ఎఫ్ఎఫ్‌బీ ధర నిర్ణయ విధానం వంటి అనేక అంశాలు తుది ధరను ప్రభావితం చేస్తాయి. కానీ చౌక దిగుమతులు దేశీయ ఉత్పత్తిపై ధరల ఒత్తిడిని పెంచే అవకాశాన్ని విస్మరించలేం. అందుకే నాడు రైతు రక్షణ కోసం అవసరమని భావించిన దిగుమతి రక్షణను నేడు వరుసగా ఎందుకు తగ్గించాల్సి వస్తోంది? అన్నది ప్రశ్న. వినియోగదారుడి ప్రయోజనం ముఖ్యమే, పరిశ్రమ ప్రయోజనం కూడా అవసరమే;కానీ వీటి మధ్య రైతు ప్రయోజనం బలికాకూడదు. ఇప్పటికే ఆయిల్‌పామ్ వేసిన రైతుకు భవిష్యత్ ఆదాయంపై అనిశ్చితి ఏర్పడితే కొత్తరైతులు ఈ పంటవైపు రావడానికి వెనుకడతారు. తోటల నిర్వహణపై పెట్టుబడులు తగ్గవచ్చు, ప్రాసెసింగ్ సామర్థ్యంపైనా ప్రభావం పడవచ్చు. చివరకు వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలన్న జాతీయ లక్ష్యానికే ప్రతికూల పరిస్థితి ఏర్పడవచ్చు.కేంద్ర ప్రభుత్వం వినియోగదారుడిని రక్షించాలి, అదే సమయంలో ఆయిల్‌పామ్ రైతు ఆదాయాన్ని కూడా రక్షించాలి. ఈ రెండూ పరస్పర విరుద్ధ లక్ష్యాలు కావు. ముఖ్యంగాక్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాల్లో కీలక మార్పులు చేసే ముందు ఆయిల్‌పామ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సంప్రదింపులు జరపాలి.

# డంపింగ్ యార్డ్ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 9 (జ్యోతి ప్రభంజనం ప్రతినిధి):మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న



దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న పరిసర కాలనీవాసులకు ఉపశమనం కల్పించేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం కాలనీ ప్రజలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి వెంకట నరసయ్యతో కలిసి డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలనుపరిశీలించారు. దాదాపు 20 కాలనీలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దుర్వాసనతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులుడంపింగ్ యార్డ్ నుంచి ప్రతిరోజూ వెలువడుతున్న దుర్వాసనతో జీవనం సాగించడం కష్టంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. యార్డ్ నుంచి వెలువడుతున్న రక్తం, కొవ్వు పదార్థాలు, మురుగునీటి కారణంగా పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో వ్యర్థాల నుంచి తీవ్ర దుర్వాసన వెలువడుతోందని పేర్కొన్నారు. దీనివల్ల వృద్ధులు, ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారు శ్వాసకోశ సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, దుర్వాసనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. గతంలో పలు చర్యలు చేపట్టాం: ఎమ్మెల్యేఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి గతంలోనే పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సుమారు రూ.6 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మించినట్లు గుర్తు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను తీసుకొచ్చి ఇక్కడ వదులుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో అప్పటి అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త వేస్తున్న లారీలను గుర్తించి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.గతంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, అటవీ శాఖ, హైలా తదితర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలను వేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిల్వ ఉన్న మురుగునీటిని తరలించేందుకు మోటార్లను ఏర్పాటు చేయించడంతో పాటు దుర్వాసన రాకుండా పర్యవేక్షణను బలోపేతం చేసినట్లు వివరించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలుఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని కెమికల్, ఫర్టిలైజర్ గోదాములు, మెకానికల్ షెడ్లను తనిఖీ చేసి, డ్రైనేజీ మార్గాల ద్వారా వ్యర్థ పదార్థాలు, రసాయనాలను విడుదల చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్ద గతంలో వాచ్‌మన్‌ను నియమించడంతో పాటు ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం కూడా చేపట్టినట్లు గుర్తు చేశారు. ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి సంబంధించిన పనుల్లో దాదాపు 90 శాతం తాను చేయించినట్లు పేర్కొన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదంటూ కొన్ని గ్రూపుల్లో విమర్శలు చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, రాజకీయ విమర్శలకు అతీతంగా డంపింగ్ యార్డ్ పరిసర కాలనీల ప్రజలకు దుర్వాసన సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,కాలనీవాసులుఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, సంతోష్ గుప్తా, రవి, బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు అంజయ్య గౌడ్, గోపికృష్ణ రెడ్డి, రమేష్, రవి, విజయ, ప్రభాకర్, సాంబిరెడ్డి, రాజేష్, రంగారెడ్డి, వాసు యాదవ్, గాలయ్య, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కర్మధర్మం

కర్మఫలం ఆశించకని



కర్మను మాత్రం విడువకు,
ఫలం ఆలస్యమైందని
నీ అడుగులను ఆపకు.
విత్తనం నాటిన చేతికి
పంటపై హక్కు ఉండదు,
నీటి బొట్టు పోసిన మేఘం
తన వర్షాన్ని లెక్కించదు.
నువ్వు చేసే ప్రతి కర్మకు
ఒక అదృశ్యమైన ప్రతిధ్వని,
నువ్వు వేసే ప్రతి అడుగుకు
కాలమే సాక్ష్యమై నిలవనీ.
విరక్తి అంటే కర్మవిముఖత కాదు,
ఫలంపై మమకారం లేకపోవడం,
నిస్వార్థం అంటే చేతులు ముడుచుకోవడం కాదు,
ధర్మమార్గంలో నడవడం.
ప్రశంస కోసం పని చేస్తే
ప్రశంసతోనే బంధితుడవుతావు,
ఫలం కోసం పని చేస్తే
ఫలితానికే బానిసవుతావు.
కర్తవ్యమే నీ చేతిలో ఉంటే
ఫలితం కాలం చేతిలో ఉంటుంది,
నీ ప్రయత్నం నిజాయితీగా ఉంటే
నీ అంతరాత్మే నీకు సాక్షిగా ఉంటుంది.
ఆశల సంకెళ్లు తెంచుకొని
అహంకారాన్ని దూరం చేసి,
నిస్వార్థ కర్మను ఆచరించడమే
ఆత్మస్వరూపుడైన మనిషి ధర్మం.
గెలుపు వచ్చినా గర్వించకు,
ఓటమి వచ్చినా కుంగిపోకు,
కర్మను పూజగా భావించి
ధర్మాన్ని మాత్రం వీడిపోకు.

రచన : కె.మురళీమోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

# ఆర్టీఐ చట్టంపై అధికారులకు అవగాహన తప్పనిసరి!

### పారదర్శక పాలనకు సమాచార హక్కు చట్టం కీలకం
### చండూరు డివిజన్‌లో ఆర్టీఐ వారోత్సవాలు




చండూరు, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 9 : ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని చండూరు ఆర్డీవో వి. శ్రీదేవి అన్నారు. ఆర్టీఐ వారోత్సవాలు?2026లో భాగంగా శుక్రవారం చండూరు డివిజన్ స్థాయిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ శాఖల అధికారులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చట్ట నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందే హక్కు ఉందని, ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు చట్ట నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకొని, సమాచార అభ్యర్థనల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కార్యక్రమంలో వివరించారు. ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకతను పెంపొందించడం, ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహశీల్దార్ రమాకాంత్ శర్మతో పాటు చండూరు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలు) పాల్గొన్నారు.

# గంజాయి మత్తుతో యువత భవిష్యత్తు ఛిన్నాభిన్నం

### నాటిక, పాటలతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్,:గంజాయి వంటి మాదకద్రవ్యాల మత్తుకు బానిసై యువత తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని కళాకారులు పిలుపునిచ్చారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్రప్రధాన కార్యదర్శిపల్లి నరసింహనేతృత్వంలో సింగరేణి కాలనీలోగంజాయి దుష్ప్రభావాలపైఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి మత్తు కారణంగా యువత ఎదుర్కొనే సమస్యలు, వారి జీవితాలపై పడే ప్రతికూల ప్రభావాలను కళ్లకు కట్టినట్లు వివరించే నాటికను ప్రదర్శించారు.అలాగే గంజాయి మత్తులో' అనే పాట ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. నాటిక, పాటల రూపంలో సాగిన ఈ కార్యక్రమం కాలనీవాసులను ఆలోచింపజేసింది.యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్య, ఉపాధి,కుటుంబ జీవితం దెబ్బతినడంతో పాటు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా సందేశాన్ని అందించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఆర్. శంకర్ నాయక్, డివిజన్ కార్యదర్శి షేక్ మహబూబ్, మహిళా నాయకురాలు చక్రి భాయ్, డివిజన్ నాయకులు వర్త్య దసరత్ నాయక్, నర్సింగ్ రావు, శ్యామ్,వెంకటేష్,దశరథ్ తదితరులుపాల్గొన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా,హైదరాబాద్ జిల్లా కార్యదర్శుల తో పాటు కళాకారులు జోసఫ్, భాను, అరుణ్ పాల్గొన్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు.

# ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఆరా..

### జీహెచ్ఎంసీ అధికారులకు సబితమ్మ ఆదేశాలు
### జింకల బావి కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 09:మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్‌నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని జింకల బావి కాలనీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై కాలనీవాసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.అనంతరం సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మనసు - నడత

భగవంతుడు మనిషి ముఖాన్ని చూడడు మనసును చూస్తాడు,
బయటి అలంకారాన్ని కాదు లోపలి నడతను చూస్తాడు.
గుడిలో వెలిగించే దీపం కంటే హృదయంలోని వెలుగును చూస్తాడు,
పెదవులపై పలికే ప్రార్థన కంటే చేతల్లోని నీతిని చూస్తాడు.
ఎన్ని పూజలు చేశావన్నది కాదు ఎంత
ప్రేమ పంచావో చూస్తాడు,
ఎన్ని వ్రతాలు చేశావన్నది కాదు ఎంత నిజంగా బ్రతికావో చూస్తాడు.
తలపై మోసే దేవుడిని కాదు మనసులో మోసే మానవత్వాన్ని చూస్తాడు,
పక్కవాడి కన్నీటిని తుడిచావా లేక చూసి వెళ్లావా చూస్తాడు.
ధనం ఎంత కూడబెట్టావో కాదు ధర్మంగా ఎలా సంపాదించావో చూస్తాడు,
ఎత్తుకు ఎంత ఎదిగావో కాదు ఎదిగినప్పుడు ఎవరిని నిలబెట్టావో చూస్తాడు.
నోటిలో తీపి మాటలకంటే నడతలోని నిజాన్ని చూస్తాడు,
నాలుగు గోడల మధ్య కాదు నలుగురి మధ్య నీ ప్రవర్తనను చూస్తాడు.
ఎవరూ చూడని వేళ నువ్వు చేసే పనినే నీ అసలు రూపమని చూస్తాడు,
అవకాశం వచ్చినప్పుడు చూపే నీ స్వభావాన్నే నీ విలువగా చూస్తాడు.
బలహీనుడిని తొక్కావా లేక చేయూతనిచ్చావా చూస్తాడు,
నీ వల్ల ఎవరి గుండె పగిలిందో ఎవరి గుండె నిలిచిందో చూస్తాడు.
మాట ఇచ్చి నిలబడ్డావా లేక మాట తప్పావా చూస్తాడు,
నమ్మిన మనసును కాపాడావా లేక మోసం చేశావా చూస్తాడు.
పాపం దాచేందుకు వేసిన ముసుగును భగవంతుని చూపు దాటదు,
నిజాయితీగా నడిచిన అడుగును కాలం కూడా ఎప్పటికీ చెరపదు.



చివరికి నీ వెంట వచ్చేది నీ పేరు కాదు, నీ నడత,
భగవంతుని ముందు నిలిచేది నీ రూపం కాదు,
నీ మనసు సాక్షాత్.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు. చరవాణి : 9866179385

**మొదటి పేజీ తరువాయి ..**

ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థను ఇండియా పోస్టు నిర్వహిస్తోందని చెప్పారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 36 ప్రధాన పోస్టాఫీసులు, 759 సబ్ పోస్టాఫీసులు, 5,424 బ్రాంచ్ పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని.. ఈ వ్యవస్థలో 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎన్) భాగస్వామ్యులుగా ఉంటూ.. గ్రామీణ, పట్టణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సేవలను అందిస్తున్నారని ఆయన వివరించారు. ఉపాధి కల్పన గురించి ప్రస్తావిస్తూ.. 17 విడతల రోజ్‌గార్ మేళా ద్వారా తపాలా శాఖ మొత్తం 1,86,202 నియామక ఉత్తర్వులను జారీ చేసిందని, ఇందులో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272మంది అభ్యర్థులు ఉద్యోగ నియామకాల ను పొందారని ఆయన పేర్కొన్నారు.జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా యూపీయూ అంతర్జాతీయ లేఖా రచన పోటీ 2026లో తెలంగాణ సర్కిల్ తరఫున విజేతలుగా నిలిచిన వారికి శ్రీ మూర్తి బహుమతులు అందజేశారు. తపాలా శాఖ అందిస్తున్న విభిన్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని నాయకత్వంలో తపాలా శాఖ సేవల పంపిణీని మెరుగుపరచడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు చేపడుతోందని శ్రీ మూర్తి వివరించారు. అదే సమయంలో ప్రజలకు సేవలందించాలనే కీలక బాధ్యతను కూడా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఉత్తరాలు, పోస్టుకార్డుల ద్వారా ద్వారా సమాచారాన్ని చేరవేసే రోజులు ఉండేవని, ప్రస్తుతం ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ఆధునిక మార్గాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీ మూర్తి గుర్తుచేశారు. సమాచార అనుసంధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులు తీసుకొచ్చినప్పటికీ, వ్యక్తుల మధ్య వ్యక్తిగత అనుబంధాలకు ఉన్న విలువ మాత్రం అలాగే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మారుతున్న సమాచార అవసరాలకు అనుగుణంగా భారత తపాలాశాఖ తన సేవలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూనే.. ప్రజలను అనుసంధానించడం, వారికి అవసరమైన సేవలను అందించడం అనే తన దీర్ఘకాలిక లక్ష్యానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.డిజిటల్ గా వచ్చిన మార్పుల గురించి చెబుతూ.స్వదేశీ పరిజ్ఞానం తో అభివృద్ధి చేసిన సాంకేతిక వేదిక అయిన ఏపీటీ 2.0 ప్రారంభం కావడం ఓ ముఖ్యమైన విజయమని అన్నారు. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) సహకారంతో అభివృద్ధి చేసిన డిజిపిన్ (డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్)... ప్రామాణికమైన 10 అక్షరాలతో కూడిన జియో?కోడెడ్ ఆధారిత డిజిటల్ చిరునామా నిర్దేశాన్ని అందిస్తుంది. బట్వాడా సేవల గురించి శ్రీ మూర్తి వివరిస్తూ... డోర్ స్టెప్ సర్వీస్ (డీఎస్ఎస్) అప్లికేషన్ ద్వారా డెలివరీలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చని తెలిపారు. 2026 మార్చి 17న హైదరాబాద్‌లో 24 స్పీడ్ పోస్ట్, 48 స్పీడ్ పోస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. వీటి ద్వారా 1.33 లక్షలకు పైగా వస్తువులు నమోదయ్యాయని వెల్లడించారు. 94 పిన్ కోడ్ ప్రాంతాలకు నిర్దిష్ట సమయంలో డెలివరీ అందిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టాఫీసు కౌంటర్లలో యూపీఐ, కార్డు చెల్లింపుల సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, డీఎస్ఎస్ అప్లికేషన్ ద్వారా 'క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ)' విధానంలో సేవల్ని అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 14 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఉన్నాయని తెలియజేశారు. ఇవి ఆర్థిక సంవత్సరం 2025?26లో 1,66,478 పాస్‌పోర్ట్ లావాదేవీలను, 2026 సెప్టెంబర్ వరకు మరో 87,100 లావాదేవీలను నిర్వహించాయని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 263 ఆధార్ కేంద్రాలు 2025?26 ఆర్థిక సంవత్సరంలో 4,75,592 లావాదేవీలను, 2026 సెప్టెంబర్ వరకు మరో 3,17,146 లావాదేవీలను నమోదు చేశాయి. తపాలా వ్యవస్థ




ద్వారా నెలకు సుమారు 20 లక్షల మంది లబ్ధిదారులు చేయూత పింఛన్లను పొందుతుండగా, నెలకు దాదాపు ?500 కోట్ల పంపిణీ జరుగుతోంది. ఉప తపాలా కార్యాలయాల ద్వారా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) రుణ చెల్లింపుల సేకరణలో స్త్రీనిధికి కూడా తపాలా శాఖ సహకరిస్తోంది. 'హోలీ బ్లెస్సింగ్' చొరవ ద్వారా వేలాది ప్రసాదం పార్శిళ్లను నేరుగా భక్తుల ఇళ్ల వద్దకే చేరవేసింది. ఆర్థిక సమ్మిళిత్వం గురించి శ్రీ మూర్తి ప్రత్యేకంగా వివరించారు. 2026 మార్చి 31 నాటికి తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో 1.07 కోట్ల లైవ్ పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ (పీవోఎస్బీ) ఖాతాలు ఉన్నాయని తెలిపారు. తపాలా ఆర్థిక సేవల ద్వారా 2026?27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి తెలంగాణ గ్రామీణ జనాభాలో 25 శాతం మందిని ఆర్థిక సమ్మిళిత్వం పరిధిలోకి తీసుకురావాలని ఈ సర్కిల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 శాతం పీవోఎస్బీ ఖాతాలను డిజిటల్ లావాదేవీల దిశగా మళ్లించాలని యోచిస్తోంది. వినియోగదారుల సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ లాంటి డిజిటల్ సదుపాయాలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నారు. పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ (ఆర్‌పీఎల్ఐ) పథకాలు పౌరులకు బీమా రక్షణను అందిస్తున్నాయని ఆయన తెలియజేశారు. పీఎల్ఐ పరిధిని ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా నిపుణులు, పట్టభద్రులకు కూడా విస్తరించగా, ఆర్పీఎల్ఐని పట్టణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. 2025?26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ సర్కిల్ 71,233 కొత్త పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీలను విక్రయించింది. వాటి ద్వారా రూ. 590.13 కోట్ల ప్రీమియం వసూలు చేసిందని వివరించారు. సర్కిల్ ఆర్థిక పనితీరును వెల్లడిస్తూ... 2025?26 ఆర్థిక సంవత్సరంలో రూ.661.88 కోట్ల లక్ష్యానికి గాను తెలంగాణ సర్కిల్ రూ.596.71 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2026 సెప్టెంబర్ నాటికి రూ.322.28 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని శ్రీ మూర్తి తెలిపారు.

# నేరాల నియంత్రణ, నాణ్యమైన దర్యాప్తు, నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన




కేసులు, పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి,నేరాల నియంత్రణ,కోర్టు కేసుల పరిష్కారం, ఈ-సాక్ష్య, ఈ-సమ్మన్స్ అమలు, నిందితులకు శిక్షలు పడేలా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఎస్పి సమగ్రంగా సమీక్షించా రు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ,విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగాపనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరును విశ్లేషిస్తూ, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులనుసమీక్షి స్తూ, ప్రతి కేసులో దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేసి చట్టప్రకారంచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలు మరియు పిల్లలపై నేరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కేసుల దర్యాప్తులోఈ-సాక్ష్య విధానాన్ని నిబంధనల ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు.నేర స్థలంలో లభించే ఆధారాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర కీలక సాక్ష్యాలను చట్టబద్ధమైన విధానంలో సేకరించి భద్రపరచాలని,సాక్ష్యాల సేకరణలో పారదర్శ కత,ఖచ్చితత్వం పాటించాలని తెలిపారు.సాక్ష్యాధారాల్లో లోపాల కారణంగా నిందితులుశిక్షల నుంచితప్పించుకునేపరిస్థితులు రాకుండా దర్యాప్తు అధికారులు ప్రతి అంశాన్నిక్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఫోరెన్సిక్ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీ, డిజిటల్ ఆధారాలను కేసు స్వభావానికి అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. కోర్టుల నుంచి జారీ అయ్యే సమ న్లు, వారెంట్ల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు. ఈ-సమ్మన్స్ ప్రక్రియను నిబంధనల ప్రకారంఅమలు చేస్తూ, సంబంధిత వ్యక్తులకు సమన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని,వాటి అమలు వివరాలను ఎలక్ట్రానిక్ విధానంలో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను గుర్తించి, నిందితులను చట్టప్రకారం కోర్టు ముందు హాజరుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులపై దర్యాప్తు అధికారులు నిరంతరం దృష్టి సారించాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ కేసుల విచారణను సమర్థవంతంగా ముందుకుతీసుకెళ్లాలని సూచించారు.సాక్షులు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, చార్జిషీట్లు, సాక్ష్యాధారాలు, ఇతర అవసరమైనపత్రాలను సక్రమంగా సిద్ధంచేయాలని తెలిపారు. నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సమర్పణ ద్వారా నేరస్తులకు శిక్షలుపడేలా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి వాటిపరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణరూపొందించాలని సూచించారు.దొంగతనాలు, చైన్ స్నాచింగ్,వాహనాల చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎస్పీ సూచించారు.గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలను పర్యవేక్షిస్తూ, అనుమానితులపై నిఘా కొనసాగించాలని తెలిపారు. నేరంజరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి,సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం ఆధారంగా నిందితులను త్వరితగతిన గుర్తించాలన్నారు.దొంగిలించిన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో అధికారులు సత్వరమే స్పందించాలని ఎస్పీ సూచించారు. బాధితుల ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, చట్టప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. పోక్సో కేసుల్లో నిర్ణీత కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు అవసరమైన రక్షణ, సహాయ సహకారాలు అందేలా చూడాలని ఆదేశించారు. మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, షీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, ఓటీపీ మోసాలు, యూపీఐ, క్యూఆర్ కోడ్ మోసాలు, నకిలీ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, సైబర్ క్రైమ్ గౌట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. నమోదైన సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకులు, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును నిలిపివేసేందుకు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానిత ప్రాంతాలను గుర్తించి తనిఖీలు నిర్వహించాలని, విద్యాసంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాల ప్రభావం పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును



గుర్తించి, ప్రధాన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అతివేగం, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతపై వాహనదారులు, విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ తెలిపారు. రాత్రి పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలను పర్యవేక్షిస్తూ, నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టాన్ని సమానంగా అమలు చేస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం స్పందించాలని ఎస్పీ సూచించారు.బాధితుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.పోలీస్ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ,రమేష్, డీఎస్పీలు, శివరాం రెడ్డి, రవి, శ్రీనివాస రావు,సీఐలు, ఎస్ఐలు, ఇతర సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అందరి సమన్వయ కృషితోనే నాకు ఈ అవార్డు దక్కింది.

నల్గొండ సమాచార హక్కు చట్టాన్ని నల్గొండ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా అధికారులు ,పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల కృషి వల్లనే జిల్లాకు అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకుగాను శుక్రవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్ల చేతులమీదుగా అవార్డుతో పాటు, జ్ఞాపికను అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు , సిబ్బంది, ఆయా శాఖలలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేస్తున్న పి ఐ ఓ లు, ఏపీఐవోల కృషి వల్లనే ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టం కింద కేసులను పరిష్కరించడంలో కూడా నల్గొండ జిల్లా రాష్ట్రంలో 2 వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ ఇంకా బాగా పని చేస్తే కేసుల పరిష్కారంలో మొదటి స్థానంలో నిలుస్తామని, ఆ విధంగా అధికారులు, సిబ్బంది



అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.

# సీ ఈ సీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

### సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్




సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం అక్టోబర్ 09:గత్యంతరం లేదు జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందేనని ?సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు శుక్రవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో జరిగిన సిపిఐ పార్టీ మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ ఓటు చోరీ పాల్పడుతున్న జ్ఞానేష్ అరెస్ట్ చేయాలని ?ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని, సర్ , పామ్ 6మార్పులను వ్యతిరేకిస్తూ, భారతీయులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు?ఎన్నికల కమిషన్‌లో జరుగుతున్న అప్రజాస్వామిక విధానాలపై న్యాయ విచారణ జరపాలని, ఎన్నికల కమిషన్ నియామకాన్ని గతంలో ఉన్న విధానంలోనే చేపట్టాలని డిమాండ్ చేశారుసిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ×రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బిజెపికి వత్తాసు పలుకుతూ ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యం పై దాడి చేయడమేనని ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను జాబితానికి తొలగించే ప్రయత్నాలను నిలిపివేయాలని ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాథమిక హక్కు అని ఓటరు జాబితా సవరణలో ప్రతి ఓటు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నదని ఓటు హక్కు పరిరక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు ప్రజలు కలసి నడవాల్సిన అవసరం ఉ ందని ఆయన అన్నారుసమావేశానికి మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అపరారపు పున్నయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

### పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకుడు గజ్జల రామచందర్

మహేశ్వరం,జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, మహేశ్వరం, అక్టోబర్ 9: మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అర్హులైన మహిళలకు చేరవేయాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే కిచెన్నగారి లక్ష్మారెడ్డి సూచనతో మీర్‌పేట్ 60వ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఆఫీసర్స్ కాలనీలో శుక్రవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బసి గూడెం బల్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గజ్జల రామచందర్ హాజరై చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు.మహిళల సంక్షేమం, గౌరవానికి ప్రాధాన్యమిస్తూ చేపట్టే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మహిళల పట్ల గౌరవభావాన్ని మరింత పెంపొందిస్తాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి



తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ నగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంద బలరాం, కళావతి, సమరీన్ సుల్తానా, జహీర్, ఆర్‌పీ భాగ్యలక్ష్మి తదితరులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమాలు తప్పవు.

### 5420 కోట్ల ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి.
### సిపిఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్.

మునుగోడు, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 09:ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్ సి) ట్రూ ఆఫ్ పేరుతో విద్యుత్ చార్జీలను పెంచే ఆలోచన విరమించుకోవాలని, ట్రూ ఆఫ్ పేరుతో 5,420.23 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుండి 18 వరకు నలగొండలో జరిగే అఖిలభారత రైతు సంఘం 36వ



జాతీయ మహాసభల జయప్రదాయాన్ని కోరుతూ శుక్రవారం పస్నూరు గ్రామం లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలతో ప్రజలు ఆర్థిక పరిస్థితి దిగజారి సతమతం అవుతున్నారని మరో పక్క ఎల్ నినో కరువు వెంటాడుతున్న సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం మూలిగే నక్కపై తాటిపడ్డ చందంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ శాఖల నుండి 57,336 కోట్ల బకాయిలు వసూలు చేయకుండా ప్రజలపై భారాలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం



కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కరెంటు కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నా యని , రైతులకు 7 గంటలకు రెంట్ కూడా ఇవ్వటం లేదని వచ్చి పోయే కరెంటుతో స్టార్టర్ ,మోటర్లు కాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులకు నిరంతరాయంగా కరెంటు ఇచ్చి పంట పొలాలను కాపాడాలని కోరారు, రైతు సంఘం జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు రైతాంగం ప్రజలు రైతాంగం ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.జాతీయ మహాసభల్లో వ్యవసాయ రంగం రక్షణ, రైతుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన ఉద్యమ కార్యచరణలు ఈ మహాసభల్లో చర్చించి రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభల జయప్రదానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం, నాయకులు ఆకారపు కాశయ్య, రెడ్డి మల్ల గోవింద్, లక్ష్మయ్య, రాజు, సైదులు, యాదమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ వారోత్సవాలు మొక్కుబడిగా కాదు.. క్షేత్రస్థాయిలో చట్టం అమలు కావాలి

### అధికారులకేనా ఆర్టీఐ అవార్డులు.. సామాజిక కార్యకర్తలకు గుర్తింపు ఏదీ?
### సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న కార్యకర్తలనూ గుర్తించాలి: రాపోలు లింగస్వామి

హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 09: సమాచార హక్కు చట్టం 2005 అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల అధికారులను అవార్డులకు ఎంపిక చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఏళ్ల తరబడి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కు కార్యకర్తలను ఎందుకు గుర్తించడం లేదని ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి ప్రశ్నించారు.శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ వారోత్సవాలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా,చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అవగాహన కల్పించడంలో



ప్రభుత్వాలు విఫలం!సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలకు పైగా గడుస్తున్నా, నేటికీ సామాన్య ప్రజలకు ఈ చట్టం అందని ద్రాక్షగానే మిగిలిపోతోందని లింగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టం అంటే ఏమిటి? దాని ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలేమిటి? ప్రభుత్వ శాఖల నుంచి సమాచారాన్ని ఎలా పొందాలి?అనే అంశాలపై కనీస అవగాహన కూడా చాలామందికి లేదన్నారు. ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధికారులకే గుర్తింపా.కార్యకర్తల సేవలు కనిపించవా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న అధికారులను గుర్తించి అవార్డులు అందించడం మంచి పరిణామమేనని పేర్కొన్న ఆయన, అదే సమయంలో సంవత్సరాల తరబడి సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్న ఆర్టీఐ కార్యకర్తల సేవలను కూడా ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న అధికారుల పనితీరుకు అవార్డుల ద్వారా గుర్తింపు లభిస్తున్నప్పుడు, ప్రజాహితం కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలకు ఎందుకు గుర్తింపు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.అవార్డులు అధికారులకే పరిమితం కాకుండా, సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలకూ అందాలి అని స్పష్టం చేశారు.మండల, జిల్లా,రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఇవ్వాలి.సమాచార హక్కు కార్యకర్తల ను మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిలో గుర్తించి తగిన ప్రోత్సాహకాలు, పురస్కారాలు అందించాలని రాపోలు లింగస్వామి సూచించారు. ఇలా చేయడం వల్ల కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరగడమే కాకుండా, చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణకు నిజమైన సార్థకత రావాలంటే సభలు,సమావేశాలు నిర్వహించడం తో సరిపెట్టకుండా, ప్రతి గ్రామంలోనూ ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. సమాచార హక్కు చట్టం కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా, సామాన్యుడి చేతిలో ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలని, అందుకోసం ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాపోలు లింగస్వామి డిమాండ్ చేశారు.

# అల్లి కనకమ్మ జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):అల్లి కనకమ్మ చూపిన ప్రేమ అనురాగాలు మంచితనం మానవత్వం వీటన్నిటిని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. ప్యూన్ బస్తీలోని శుక్రవారం దివంగత అల్లి కనకమ్మ దశదినకర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యే కూనంనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకమ్మ సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా మిమిక్రీ రమేష్, అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, కలవల రాందాస్, మారపాక కృష్ణస్వామి, తాండూరు ధనరాజ్ వీరంతా గొప్ప కళాకారులని తన విజయం వెనుక వీరి కృషి ఎంతో ఉన్నదని అందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ "కళాభారతి" కళాకారుల భవన నిర్మాణాన్ని తప్పకుండా ఏర్పాటు చేస్తానని వృద్ధ కళాకారులకు నిరుద్యోగ కళాకారులకు తప్పకుండా పెన్షన్స్ మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి



ఎస్ కే సాబీర్ పాషా, ఒకటవ టౌన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ జితేందర్, ప్రముఖ డాక్టర్ అల్లూరి నాగరాజు, అపరబాలు అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివ కుమార్, హైదరాబాదు నుండి ప్రత్యేకంగా విచ్చేసిన అంతర్జాతీయ మిమిక్రీ ధ్వని అనుకరణ చక్రవర్తి జల్లారపు రమేష్, సినీ నటులు తాండూర్ ధనరాజ్,ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ వెంకట రాముడు, కార్పొరేటర్లు తలుగు అనిల్ కుమార్, కనుకుంట్ల శ్రీను(కేకే), ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంతోటి పాల్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, భూపతి అశోక్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఆరిఫ్ ఖాన్, ప్రముఖ కళాకారులు ప్రముఖ సంగీత దర్శకులు అపర ఇళయరాజా, మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, ప్రముఖ సీనియర్ కీబోర్డు ప్లేయర్ సిహెచ్ జాన్ రత్నం, వర్ధమాన సినీ సంగీత దర్శకులు సలవాది విజయ్, ప్రముఖ రిథమిస్ట్ వైదేవ సహాయం, ప్రముఖ రిథమ్ ప్యాడ్ ప్లేయర్ సంగీతరావు, గాయకులు సబ్బారపు కృష్ణ, ప్రముఖ రిథమిస్ట్ రంజిత్, టేప్ ఆర్టిస్ట్ శ్రీనివాసరావు, ప్రముఖ క్రీస్తు సువార్తికులు కేదాసి పీటర్ బాబు, మాతంగి నరసయ్య, కోటేశ్వరరావు, ఉల్లోజు వెంకట్, మద్దెల వెంకటయ్య,మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, ప్రముఖ సామాజిక జానపద గాయకులు చింతల కనకయ్య, కన్నం చంద్రయ్య, సముద్రాల శ్రీనివాస్, శ్రీనివాస్, అల్లి రమేష్, కుటుంబ సభ్యులు అల్లి మల్లయ్య, అల్లి హనుమంతు, అల్లి రాఘవులు, అల్లి సన్నీ, అల్లి పవన్, అల్లి ప్రశాంత్, మనుమరాండ్రు మనుమల్లు పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**